# శలభాలు

'సికె'

"రెడ్డి లేకపోవటంచేత ఆట రమ్యంగా సాగటంలేదు ఇవ్వాళ", అన్నారు రావుగారు, కాఫీకప్పు పెదవికి చేరుస్తూ.

"నిజం, నిజం..." అన్నాయి పక్క తాళాలు, కాఫీకప్పులు క్రిందపెడ్తూ .. మళ్ళీ అంతా పరీక్షకు చదువుతున్న కుర్రాళ్ళలా పేకముక్కల్లో మునిగిపోయారు.

అది రావుగారి మేడ. పెద్ద స్థేమతో పేకాడేవారికి చక్కని నీడ. దర్జాకు తగ్గట్టుగా రావుగారి అతిథి (?) మర్యాదల్లో ఏ లోపంరాదు దర్జాకు, హోదాకు అయన్నే చెప్పుకోవాలి. ఆ అందమైన మేడలో... బూరుగుదూది పరుపుల మీద హాయిగా కూర్చుని, సిగరెట్లు–కాఫీలు చకచకా అందుతూవుంటే— అదీ బయటవర్షం పడుతూవుంటేనో, చలిచలిగా వుంటేనో- పేక ఆడటంలో వున్నమజా వారికేతెలుసు.

ఈ రోజువున్న లోటంతా రెడ్డిబాబు లేకపోవటమే... వారి ఛలోక్తులు .. ఆ ఆనందానికి తాలింపురుచి తెచ్చిపెడ్తాయి. ఆమాటే తల్చుకున్నారు, రావుగారు.

"దొరా! దొరా!!"— కొంపలంటుకు పోతున్నట్టున్న పిలుపువిని గబగబా మేడ దిగివచ్చారు రావుగారు.

పాలేరు రాముడు వగరుస్తూ "దొరా, రెడ్డిబాబు [1]దూరంత దున్నిపిచ్చిండు. మన చేండ్లకల్లి అల్లకు జాగారావాల్నట .. అదికూడ దున్నిపిస్తడట— లొల్లిలొల్లిగా ఉన్నది!" అని చెప్పాడు.

రావుగారి మొహం రక్తంతో నిండింది. కళ్ళు చంద్రనిప్పుల్లా మండాయి. ..ఉగ్రనరసింహావతార మెత్తారు.

"ఎవడ్రా– ఎవడి కంతధైర్యం?" — అరిచారు రావుగారు.

---

1. దూర — రెండు చేలకు హద్దులు నిర్ణయించే గట్టు.

"రెడ్డిబాబు స్వయాన పక్కనుండి దున్నిపిస్తాండు, దొరా!"

"హుం - మేడిపండు ముండాకొడుకు నామోచేతినీళ్ళు తాగి నాకే ఎసరుపెడ్తాడా-? సరే- నేను వస్తున్నాను... బండికట్టు..." రావుగారు మిత్ర బృందానికి త్వరలో వస్తానని, ఆట సాగించవలసిందని చెప్పి బయల్దేరారు.

ఎద్దులు గలగలగల గజ్జెల చప్పుడుచేస్తూ పరుగులుతీసాయి ప్రక్కన రాముడు పోటీ వేసుకున్నట్టు పరుగులతో వస్తున్నాడు

రావుగారక్కడికి చేరగానే చూసినదృశ్యం— [2]ఆవారీ భీమన్న కర్రతిప్పుతూ "రండ్రా, నా మాదిక్కొడుకులారా!.. రండ్రా . ఇంకోడస్తరో రండ్రా.. నా భూమిలకి కాలుపెట్టి దున్నతార్రా మీరు... ఇరవై ఏండ్లనుంచి నెత్తురువోసి పండిస్తున్న ఇయ్యాలొచ్చి నా భూమిల కాలుపెడ్తార్రా .. ఇది నాతల్లిరా .. నా తల్లిమీద చేయివేసినోడి నెత్తురుతాగక యిడిసిపెడ్తాన్రా!" అంటూ అరుస్తున్నాడు.

ప్రక్కనే బుర్రపగిలి, రెడ్డిబాబు పాలేరు 'రంగడు' రక్తం మడుగులోవున్నాడు. అంతా అర్థం చేసుకున్నారు రావుగారు.

రావుగార్ని చూడగానే రెడ్డిబాబు పక్కచేనులోంచి వచ్చి, రావుగారికి వినయంగా నమస్కరించాడు. రావుగారి మనస్సు చిటపటలాడింది. "చేసింది చాలక... మర్యాదలు కూడానా? అనాడు.. ఏదో మనవాడేగదా. అన్యాయం జరిగేది మనక్కాదుగదా అని పూరుకుంటే దొరికిన చేను. అది మచ్చిపోయి... తిన్నయింటి......"

"దొరగారు తప్పర్థం చేసుకున్నారు. ఇది పాలేర్ల మధ్యవచ్చిన అపార్థంవల్ల జరిగిన అనర్థం! ఇందులో నాచెయ్యి ఏమీలేదు .. అంతకన్న చావేమేలు. ముందు జరగవల్సింది దొరగారు చూడాలి." రెడ్డిగారు మంచుగడ్డకంటే చల్లగా మాట్లాడతారు. రావుగారు చల్లారారు. జరగవల్సింది వారు చూస్తూండగానే జరిగిపోయింది .. పంచనామా జరిగింది... భీముని చేతులకు బేడీలుపడ్డాయి.

సాయంత్రం రావుగారి ఇంటివద్ద భీముని భార్య ఆక్రందనలకు దొరికిన జవాబు, "నేను చెయ్యవలసినంత చేస్తాను. ఆపైన భగవంతునిదే భారము! భీముడికి శిక్ష

2. ఆవారీ— పాలేర్లలో ఒకడ్ని ఎన్నికచేసి— సుపర్వైజన్ అప్పగిస్తారు. అతన్ని ఆవారీఅని పిలుస్తారు.

792

తప్పటం కష్టమే... అయినా వాడ్నసలు ఎవరు హత్యలు చేయమన్నారు? వాడికొంపే మునిగినట్టు ఏమిటా గందరగోళము!! ఏదో మాలోమేము చూసుకునేవాళ్లం .. తేలుకు పెత్తనమిస్తే తెల్లవార్లూ తెగకుట్టిందట!......"

అదే సాయంత్రం— రంగడి భార్య రెడ్డిబాబు ఇంట్లో గుండెలు బాదుకుంటే దొరికిన జవాబు— "నన్నేం చేయమంటావు, చెప్పు! భీము డిలా చేస్తాడని కల గన్నానా? నీవెంతఏడ్చినా చచ్చినవాడెటూ తిరిగిరాడు... నీబ్రతుకంతా ముందేవుంది.. నీ రెక్కలున్నంతసేపు దొక్కాడదనే భయమెక్కడ?......"

మర్నాడుదయం మహల్‌లో మహిఫిల్ వెలిసింది. ఆట జోరుగా, వయసొచ్చిన పిల్లతో షికారుగా నడుస్తోంది. సిగరెట్టు నుసిదులుపుతూ రావుగారు అన్నారు, "చూడండి మరి. రెడ్డివున్నాడు... ఆట రమ్యంగా సాగుతోంది..."

"అవునవును," అన్నాయి పక్కతాళాలు తళాంగిత తకిధిన్‌తోమ్! రెడ్డి ముసి ముసి నవ్వులు నవ్వుతూ— నిన్న జరిగిందంతా చెప్పి,

"దొంగవెధవ— — భీముడు స్వంత పొలమయినట్టే గంతులు వేసాడయ్యా. సానిది విటరాయుడ్ని పట్టుకుని— నీవేనా పతిరాయుడి వన్నట్టు— దొరగారికి కూడా భయమేసి వుంటుంది— "ఇది నా చేనా, భీముడి చేనా" అని. అంతా గొల్లుమని నవ్వారు. రెడ్డిబాబు ఆటమూసాడు.... రావుగారు కౌంట్ ఇచ్చుకున్నారు.

మొన్నరాత్రి భీముడ్ని పిలిపించి— 'రావుగారి పొలంలోని రెండెకరాలు తనచేన్లో కలిపినాక దూరపెట్టనిస్తే రెండువందల రూపాయిలిస్తాననీ, ఇదంతా దొరగారికి తెలిసే ప్రమాదమేలేదనీ, దొరగారికి తనచేలు ఎటు ఎన్ని ఎకరాలున్నాయో తెలియదనీ— యిటు వేపు రానేరాడు కనుక తెలిసే ప్రశ్నలేదని' రెడ్డిబాబు భీమునికి నూరిపోసిన సంగతి రావుగారికి తెలియదు. —భీముడిది ఎందుకు చెప్పలేదో తెలియదు!

భీముడికి ఇష్టం వుండదని తెలిసీ ఇంత సాహసానికి రెడ్డిబాబు ఎందుకు పూనుకున్నాదో తెలియదు. రెడ్డిబాబు బుర్రలో మన ముఖ్యమంత్రి కావలసినంత తెలివి తేటలూ, అర్హతలూ వున్నాయి. ఇక అతను మనకేం అర్థమవుతాడు!

రంగడికి రెడ్డిబాబు— దొరగారి అనుమతి తీసుకునే దున్నిపిస్తున్నానని చెప్పాడని, భీముడికి తెలియదు.

ఆరాత్రి— రెడ్డిబాబుకు— రంగడి రక్తం వరదల్లో తనయిల్లూ, పిల్లలూ కొట్టుకు పోతున్నట్టు పీడకల రావటంతో పిచ్చికేకలు వేసినట్టు ఎవరికీ తెలియదు.

"నా పొలంరా.... నా భూమిరా. "అన్న భీముని అరుపులే రావుగారి గుండెల్లో మెరుపులై.... ఉరుములై భయపెట్టడంతో రాత్రి రావుగారికి నిద్ర కరువయిందని.... ఎవ్వరికీ తెలియదు.

కాని కుక్కతోక వంకర అవి అందరికీ తెలుసు.

## సెక్స్ సినిమాకి వెళ్లిన రాత్రి!

ఆర్. యస్. మూర్తి.

లీలామహల్లో ఏదో గూఢచారి సినిమా వచ్చింది. అందులో నటించిన యువతీ మణుల ఊరించే గుండెల్నీ, కవ్వించే పిరుదుల్నీ, ఉద్రేకపర్చి ఉన్మత్తపర్చే అంగాల్నీ, ఉత్తేజకరమైన పోజుల్లో— బహిరంగస్థలాల్లో ప్రదర్శించి— ఆ సినిమాని తప్పక తిలకించి, ఆనందించమని సినిమావాళ్లు మరీమరీ ఉద్బోధించేరు ప్రజల్ని ! రాజబాబు స్నేహితులంతా సినిమా చూసొచ్చి, "గొప్ప సెక్సీగావుంది గురూ పిక్చరు, మిస్సవకు సుమీ !" అని అతన్ని మరీమరీ హెచ్చరించేరు. సెక్సుకి సంబంధించిన విషయాల్లో ఆసక్తిగాని, అనుభవంగానీ లేకపోయినప్పటికీ, 'పోనీ— స్పై థ్రిల్లర్ కదా. సెన్సేషనల్ ఫైటింగ్సూ, హేర్రేజింగ్ బాక్సింగ్సూ అవీ ఉంటాయికదా. ఓసారి చూసొస్తే మునిగిపోయిందేవి' టన్న ఉద్దేశ్యంతో ఆఖరోజు రాత్రి రెండో ఆటకి ఒంటరిగా వెళ్ళేడు రాజబాబు.

* * *

....బీచొడ్డున మెత్తటి ఇసుకలో, ఆహ్లాదకరమైన వెన్నెల్లో, ఊరించే కన్నులు గలదీ, ఉవ్వొంగిన స్తనములుగలది అయిన ఒక అందాలరాసి అందంగా, అర్ధనగ్నంగా పడుకుని వుంటుంది. అనాచ్ఛాదితకాయుడు, బలాఢ్యుడు అపురూప సౌందర్యవంతుడూ అయిన యువకుడొకడు ఆ యువతిని ఆక్రమించుకుని, ఒకచెయ్యి ఆమె మెడక్రింద,

794